ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం



ఉచిత కోచింగ్ దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

త్వరలో వెలువడనున్న డిఎస్‌సి పరీక్ష ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోని గిరిజన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తదితర సెంటర్లలో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు jnaanabhoomi poratlలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఉచిత డిఎస్‌సి కోచింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గుర్లను గుణపాఠంగా తీసుకోరా?

- పొరుగు జిల్లాలో డయేరియాతో ఏడుగురు మృతి
- జిల్లాలో చాలా ప్రాంతాల్లో బావులు, బోర్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం
- పంచాయతీలకు పైసా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- 'పల్లె పండగ' పేరుతో గొప్పల ప్రచారం

విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా మృత్యు ఘంటికలు మోగిస్తోంది. ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో రోగులు ఆస్పత్రిపాలయ్యారు. గుర్లతో గరివిడి, చీపురుపల్లి గ్రామాలకూ డయేరియా ప్రబలింది. చీపురుపల్లి పక్కనే లావేరు మండలం ఉంది. అక్కడి అధికారులు ఇప్పటికే పలురకాల చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం చాలా నిర్లిప్తంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా పంచాయతీ, డిఎంహెచ్‌ఒ తదితర ప్రభుత్వ శాఖలతో కనీసం సమీక్షించిన దాఖలాల్లేవు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 921 పంచాయతీలు ఉన్నాయి. వీటికి ప్రధానంగా ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, తలసరి ఆదాయం గ్రాంట్లే ఆర్థిక వనరులు. వీటితోనే గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుద్దీపాలు, వాటి మరమ్మతుల పనులు చేపట్టాల్సి ఉంటుంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. వచ్చే నెల పంచాయతీ ఖాతాల్లో జమవుతాయని అధికారులు చెప్తున్నారు. మరోవైపు పంచాయతీలకు జనరల్ ఫండ్ సమకూరుతున్నా, అదీ చాలా స్వల్పంగానే ఉంటోంది. వాటినీ సక్రమంగా వినియోగిస్తున్న పరిస్థితులు లేవు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై పంచాయతీ అధికారులకు పర్యవేక్షణ కొరవడడంతో తీవ్ర అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. కాలువల్లో పూడిక తీయక పోవడంతో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. బావులు, బోర్ల చుట్టూ రోజుల తరబడి మురుగునీరు చేరడంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఆ నీటినే ప్రజలు తాగునీరుగా ఉపయోగిస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడే స్పందిస్తున్న అధికారులు, పారిశుధ్య నిర్వహణ తమ పని కానట్లుగా వ్యవహరిస్తున్నారు.



బూర్జ మండలం పెద్దలంకలో బావి వద్ద అపరిశుభ్ర పరిస్థితులు

గ్రామాలకు రక్షిత నీరేది?

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 4037 గ్రామాలు ఉండగా, కేవలం 1518 గ్రామాలకే తాగునీరందుతోంది. 2519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా జరుగుతోంది. ఆయా గ్రామాల ప్రజలు చేతి పంపులు, బావులు, నదులు, చెలమలు, గెడ్డలు, వాగుల్లోని చెలమలపై నీటి కోసం ఆధారపడుతున్నారు. కలుషితమైన నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ రక్షిత తాగు నీరందిస్తామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నా అవేవీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

స్టాప్ డయేరియా చర్యలు ఆపేశారా?

జిల్లాలో జూలైలో మొదటి వారం రోజుల్లోనే ఏకంగా 67 డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆగస్టు ఏడో తేదీన కోటబొమ్మాళి కెజిబివి స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. అంతకుముందు జూన్ 27న శ్రీకాకుళం నగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో తొమ్మిది మంది విద్యార్థులు డయేరియా బారిన పడడంతో వారికి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స అందించారు. స్టాప్ డయేరియాతో పేరుతో జూలై ఒకటి నుంచి 30వ తేదీ వరకు క్యాంపెయిన్ నిర్వహించారు. ఒఆర్‌ఎస్, జింక్ మాత్రలను అందించారు. ఇప్పుడు పొరుగు జిల్లాలో డయేరియాతో మృత్యువాత పడుతున్న వార్తలు వస్తున్నా, కనీసం ప్రాథమికంగానైనా ఇక్కడ అటువంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు.

అటకెక్కినా అచ్చెన్న మాటలు

టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా కొలువు దీరిన సందర్భంలో జిల్లా అధికారులతో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఏడు రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డిపిఒ, డిఎంహెచ్‌ఒలను ఆదేశించారు. వారం రోజుల్లోగా పంచాయతీలు, మున్సిపాలిటీలు బాగుపడాలని ఆదేశించారు. అవేవీ అమలు కాలేదు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అవే పరిస్థితులు తాండవిస్తున్నాయి.

పల్లె పండగ పేరుతో గొప్పలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారానికి తెరతీసింది. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల పాటు పల్లె పండగ పేరుతో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేస్తున్నారు.

ఎంజిఎన్‌ఆర్‌జిఎ మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా జనరేట్ అయ్యే నిధులతో ఏటా అభివృద్ధి పనులు చేస్తున్నా, అదో కొత్త కార్యక్రమంగా ప్రచారం సాగిస్తోంది. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు నిధులు విడుదల చేయకుండా, పల్లె పండగ పేరుతో గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నిస్వార్థ శ్రామికులు పోలీసులు

- శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర కీలకం
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యతని, నిస్వార్థ శ్రామికులుగా పోలీసులు సేవలందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.ఆర్ మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావుతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. సమాజ రక్షణ, భద్రత కోసం పోలీసు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. విజయవాడలో వచ్చిన వరదల్లో పోలీసులు అందించిన సేవలు కొనియాడారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పలురకాల నేరాలు పెరిగిపోతున్నాయని, నేరాల నివారణకు స్వీయ నియంత్రణ చాలా అవసరం ఉందన్నారు. పోలీసులు, వారి కుటుంబసభ్యుల బాధ్యతను ప్రభుత్వమే వహించి వారికి రావాల్సిన ప్రతిదీ సకాలంలో అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించే బాధ్యత కూడా తీసుకున్నామన్నారు. విధుల్లో చనిపోయిన పోలీసు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులనూ అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతర పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వారు సైనికులు, పోలీసులేనన్నారు. జిల్లా పోలీసులు ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ 1958 అక్టోబరు 21న భారత చైనా సరిహద్దుల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళ్లర్పిస్తూ పోలీసు అమరవీరుల దినోత్సవంగా ఏటా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో విధినిర్వహణలో ఐదుగురు పోలీసులు ఎస్.బంగారు నాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్రదాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి అమరులయ్యారని వివరించారు. జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమరవీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 216 అమరవీరుల పేర్ల పుస్తకాన్ని మంత్రి ఎస్‌పికి అందజేశారు. డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ పుస్తకంలో పేర్లను చదివి వినిపించారు. విధినిర్వహణలో అమరుల త్యాగాలు ప్రతిఫలం గుర్తుగా వారి కుటుంబాలకు ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు. ఈ ఏడాది విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని మంత్రి అందజేశారు. అనంతరం ఓపెన్ హౌస్‌ను ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు రాజశేఖర్, శేషాద్రి, ప్రసాద్, సిఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సాగునీటి సంఘాల ఎన్నికలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 344 సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇప్పటికే ఆయా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నంబర్ల వారీగా జాబితాను నవీకరించాలని నీటిపారుదలశాఖ అధికారులు వాస్తవ ఆయకట్టుదారుడు ఎవరనే వివరాలను క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం సహాయంతో సేకరిస్తున్నారు. మార్పులు, చేర్పులు, అన్ని అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది ఎన్నికల ఓటరు (రైతులు) జాబితాను వచ్చే నెల 13వ తేదీన ప్రచురిస్తారు.

నవంబర్ 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఎన్నికలకు సంబంధించి 344 సంఘాలకు పూర్తిస్థాయి సమాచారం అందజేస్తున్నారు. సోమవారం నుంచి 40 రోజుల పాటు సాగునీటి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. సాగునీటి సంఘాలు వాటి పరిధిలోని పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతో పాటు ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి. చివరగా 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు.

ఇద్దరు కెజిబివి విద్యార్థినుల అదృశ్యం

ప్రజాశక్తి - జి.సిగడాం

మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో ఇద్దరు విద్యార్థినులు సోమవారం వేకువజామున గోడ దూకి అదృశ్యమయ్యారు. మండలంలోని ఆనందపురానికి చెందిన భార్గవి, రాజాంలోని వస్త్రపురి కాలనీకి చెందిన లిఖిత కెజిబివిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వేకువజామున నాలుగు గంటలకు రోల్ కాల్‌లో వారి గైర్హాజరీని ఉపాధ్యాయురాలు లక్ష్మి గుర్తించి ప్రిన్సిపల్ ప్రమీల దృష్టికి తీసుకెళ్లింది. పాఠశాల ఆవరణలో సిసి కెమెరాలు పరిశీలించి చూడగా, ఇద్దరు విద్యార్థులు రాత్రి రెండు గంటల సమయంలో గోడ దూకి వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మధుసూదనరావు కెజిబివికి వెళ్లి భార్గవి, లిఖిత గురించి సహచర విద్యార్థినులను అడిగారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన భార్గవి అన్యమనస్కంగా ఉండేదని వారు చెప్పారు. భార్గవి పుస్తకాలను పరిశీలించగా అందులో ఉత్తరాన్ని గమనించారు. తల్లిదండ్రులను విడిచి పాఠశాలలో ఉండడం ఇష్టం లేదని అందులో రాసి ఉంది. 'ఎంత ఓపిక అమ్మ నీకు అంటూ రాస్తూ నాన్న... నేను నీకు అసలు గుర్తుకు రావడం లేదా? అని రాసింది. విద్యార్థుల కోసం వెతకగా, వారి ఆచూకీ లభించలేదు. విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.



దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

విద్యుత్ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన అల్పపీడనం దృష్ట్యా జిల్లాలో విస్తారంగా వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం ఉంటున్న వాతావరణశాఖ హెచ్చరికలతో విద్యుత్‌శాఖ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం డివిజన్‌లో 9490610045, టెక్కలి డివిజన్‌లో 8332843546, పలాస డివిజన్‌లో 7382585630, పాలకొండ డివిజన్‌లో 8332843546 నంబర్లతో హెల్ప్ డెస్క్‌లు పనిచేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు, వైర్లు వేలాడినా, పడిపోయినా సంబంధిత డివిజన్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను తాకడం, వేలాడుతున్న వైర్లను పట్టుకోవడం, వాటి కింద నడవడం, వైర్లపై చెట్ల కొమ్మలు పడిన చెట్లను తాకడం చేయకూడదని తెలిపారు. మరిన్ని వివరాలను శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం హెల్ప్ డెస్క్ 9490612633, ఎపి ఇపిడిసిఎల్ టోల్ ఫ్రీ నంబరు 1912ను సంప్రదించాలని సూచించారు.

మైనర్ అక్కాచెల్లెళ్లపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బాధితుల తల్లి ఫిర్యాదు
- పోలీసుల అదుపులో నిందితులు
- కఠినంగా శిక్షించాలి : శిరీష



ప్రజాశక్తి - పలాస

మైనర్ అక్కాచెల్లెళ్లపై ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మరో బాలికపై మరో బాలుడు అత్యాచారయత్నానికి ప్రయత్నించగా, ఆ బాలిక ప్రతిఘటించింది. బాధితుల తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19, 20వ వార్డుకు చెందిన పదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు కలిసి శనివారం పుట్టినరోజు వేడుక చేసుకునేందుకు రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీలోని ఒక ఇంటికి వెళ్లారు. అక్కడ ఇద్దరు బాలికలకు మద్యం తాగించి ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. మరో బాలికపై ఒక బాలుడు అత్యాచారానికి యత్నించగా ఆమె ప్రతిఘటించింది. ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడుతుండగా మరో బాలుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. రాత్రి 11 గంటల తర్వాత అందరూ కలిసి ఇళ్లకు చేరుకున్నారు. అత్యాచారానికి గురైన ఓ బాలిక జరిగిన ఘటనను ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని భావించిన తల్లి స్థానిక పెద్దల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. దీంతో వారు రాజీకి గట్టి ప్రయత్నం చేశారు. అత్యాచారానికి గురైన అక్కాచెల్లెళ్లలో ఒక బాలిక ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో మనసు మార్చుకున్న తల్లి సోమవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.



సిఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే

బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఘటనా విషయం తెలుసుకున్న ఆమె కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాలికల తల్లి, సిఐ డి.మోహనరావుతో మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి సంఘటన తన నియోజకవర్గంలో చోటుచేసుకోవడం బాధకరమన్నారు. పార్టీలకతీతంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : సీదిరి

ఇద్దరు బాలికలపై అత్యాచార ఘటన బాధాకరమని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దిశ వంటి పటిష్ట చట్టాలను అమలు చేయాలని సూచించారు.

కనీస వేతనాలు చెల్లించాలి

ఎన్‌టిఆర్ వైద్యసేవ సిబ్బందికి

- 'మీకోసం'కు 138 వినతులు
- అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత
- జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని ఎపి వైద్య మిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.త్రినాథరావు, ఉద్యోగులు కోరారు. జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఇతర అధికారులతో కలిసి స్వీకరించిన వినతుల కార్యక్రమంలో వారు వినతిపత్రం అందించారు. ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్ టైం పరీక్షను ఉపసంహరించుకోవాలని, ఉద్యోగులందరికీ ఉద్యోగున్నతులు కల్పించాలని కోరారు. వైద్యశాఖ, ట్రస్టు అధికారులకు తమ సమస్యలపై పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 29వ తేదీ నుంచి విధులను బహిష్కరిస్తామని చెప్పారు.



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

వంట పనిలోకి తీసుకోవడం లేదు

బూర్జ మండలం ఒ.వి పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2006 నుంచి మధ్యాహ్న భోజన పథకంలో వంట పని కార్మికులుగా పనిచేస్తున్నామని, రాజకీయ కక్షలతో తమను ఈ ఏడాది సెప్టెంబరు 30న పని తొలగించారంటూ టి.వరలక్ష్మి, వై.లక్ష్మి, వై.జ్యోతి జెసికి ఫిర్యాదు చేశారు. తమను పనిలోకి తీసుకోవాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా తహశీల్దార్, ఎంఇఒ, హెచ్‌ఎంలు అమలు చేయడం లేదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

కన్ను పోవడానికి కారకులపై చర్యలు తీసుకోవాలి

తమ కుమారుడు చెన్నా అరుణ్‌కుమార్ కన్ను పోవడానికి కారకులైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలంటూ తల్లిదండ్రులు నాగరాజు, హారిక వారి బంధువులతో కలిసి జెసికి వినతిపత్రం అందించారు. తర్వాత జడ్‌పి సమావేశ మందిరం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. రణస్థలం మండలం పైడిభీమవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 67 ఈనెల ఒకటో తేదీన విద్యార్థులు ఒకరినొకరు తోసుకుంటున్న సందర్భంలో తెలుగు ఉపాధ్యాయుడు నగరి అరుణ్‌కుమార్ కర్రతో కొట్టడంతో తన కుమారుడి కంటికి గాయమైందన్నారు. విశాఖలోని ఎల్.వి ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా, కన్ను కనపడే అవకాశం లేదని వైద్యులు చెప్పారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యుడైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు.

చేప పిల్లల పెంపకంపై పేచీ పెడుతున్నారు

తమ సొసైటీకి చెందిన చేపల చెరువులో టిడిపి నాయకులు చేప పిల్లలను వదులుతున్నారని లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన పలువురు మత్స్యకారులు జెసికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తమకు రూ.36 వేలు విలువైన చేపలను సబ్సిడీ అందించిందని, వాటిని తీసుకొస్తున్న వ్యాన్‌ను అడ్డగించి, అందులో సగం చేపల పిల్లలు తమవే నంటూ తీసుకువెళ్లి తాము పెంపకం చేస్తున్న చెరువులో వదిలారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలి

గార మండలం కొర్నికి చెందిన ఇద్దబోయిన అప్పన్న తనకు ఉన్న పూరిల్లు పడిపోయిందని, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు అందజేసారు. ఆముదాలవలస మండలం ఆమదాలవలసకు చెందిన పొట్నూరు హేమలత వికలాంగురాలైన తను తన తండ్రి సంరక్షణలో ఉంటున్నానని, గతంలో పింఛన్ వచ్చేదని రెండేళ్లుగా పింఛన్ ఆపేశారని, పునరుద్ధరించాలని అర్జీ అందించారు. హిరమండలం మండలం అంతిలికి చెందిన పల్లె శ్రీరాములు తనకు డి-పట్టా మంజూరైందని, తనకి పట్టా ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. గార మండలం తూలుగులో గ్రామస్తులు పొలాల్లోకి వెళ్లడానికి ఉన్న గోర్జి స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని, సర్వే నంబర్ల ప్రకారం గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన సవర భాస్కరరావు, కొంతమంది గ్రామస్తులు వినతిపత్రం అందించారు.

'మీ కోసం' కు138 అర్జీలు

మీకోసంకు మొత్తం 138 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జెసితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ విజ్ఞప్తులు స్వీకరించారు. డిపిఒ కె.భారతీసౌజన్య, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, ఐసిడిఎస్ పీడీ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనంగా వసూళ్లు చేస్తున్న స్పెషల్ ఫీజులను తగ్గించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు కళాశాల ముందు సోమవారం విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వసతి దీవెన, విద్యాదీవెన వంటి పథకాలు అందకపోవడంతో ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి సమయంలో పరీక్ష ఫీజులతో పాటు, కోర్సు ఫీజులు, కళాశాల స్పెషల్ ఫీజులు ఏ విధంగా చెల్లించాలని ప్రశ్నించారు. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ స్పెషల్ ఫీజులు అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మను వివరణ కోరగా, కమిషనర్ ఆదేశాల మేరకు ఫీజులు వసూళ్లు చేస్తున్నామని, అధికంగా ఫీజులు వసూళ్లు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు కోర్సుల్లో చేరేముందే వారితో ఫీజుల విషయమై చర్చించి చేర్పించామన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు


ఆందోళన చేస్తున్న గిరిజనులు

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గొట్టిపల్లి సచివాలయం పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, నాయకులు నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లిలో గిరిజనులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొట్టిపల్లి, పుల్లగూడ ఉమ్మడి గ్రామాల కేంద్రంగా ఉన్న శ్మశాన వాటికకు రహదారి, ప్రహరీ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న చినరాజపురం, పెదరాజపురం, రోడ్లు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎత్తయిన కొండలపై ఉన్న గ్రామాలకు రోడ్లకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలన్నారు. పేదలందరికీ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. కట్టిన ఇళ్లకు బకాయిలు చెల్లించాలన్నారు. గుప్పెగూడ నుంచి మల్లేలుగూడ వరకు రోడ్డు నిర్మించాలన్నారు. అడ్డంగి, గొట్టిపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు పాలక పార్వతి, గేదెల ధర్మారావు, ఆరిక శివ, గొర్లె సరోజిని, పాలక శేషగిరి, కె.చంద్రమ్మ, పాలక రోహిణి పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


ఇచ్ఛాపురం : షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : ఈ నెల 22 నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై సదస్సుల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే 12 వరకు ఈ సదస్సులను నిర్వహిస్తామని తెలిపారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఈ నెల 22 నుంచి వచ్చే 4 వరకు రీ సర్వే పూర్తయిన 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ బడ్డే పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలు తహశీల్దార్, వీఆర్‌ఒలు తదితరులు పాల్గొంటారని అన్నారు. రీ సర్వే గ్రామాల్లో భూముల సమస్యలను, పట్టాదార్ పాస్ పుస్తకాల సరియేయడానికి దరఖాస్తులను స్వీకరిస్తామని అన్నారు.

వైసిపి పూర్వ వైభవానికి కృషి


పద్మావతి

కవిటి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసిపికి పూర్వ వైభవానికి కృషి చేస్తామని వైసిపి మహిళా జోనల్ ఇన్‌ఛార్జి బెందాళం పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని ఉత్తరాంధ్రజిల్లాల సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గతంలో విజయసాయిరెడ్డి ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు 2019 ఎన్నికల్లో వైసిపి ఘనవిజయం సాధించిందని, మళ్లీ ఆయన నాయకత్వంలో చరిత్ర పునరావృతం కావడం ఖాయమని ఆమె అన్నారు.

పోలీసు అమరవీరులకు జోహార్లు

పలాస : పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు నిర్వహిస్తున్న పనితీరుపై విద్యార్థులకు కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరణ, కేసులు నమోదు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సంజయ్, కాశీబుగ్గ మేథా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పోలీసుల అమర వీరుల దినోత్సవం సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలో ర్యాలీ నిర్వహించారు. పోలీసుల అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే ఎస్ఐ ఎస్.కె.షరీఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానభారతిలో...

ఇచ్ఛాపురం : పట్టణంలోని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సెక్రెటరీ, సిఇఒ జోహార్ ఖాన్ ఆధ్వర్యాన పోలీసు అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. దేశాన్ని కాపాడేందుకు సైనికులు, పోలీసులు చేసే త్యాగాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్‌ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, మదీనా పాల్గొన్నారు.


పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న జోహార్‌ఖాన్

ప్రభుత్వ కార్యాలయాలకు గేట్లు మార్పు

ప్రజాశక్తి- టెక్కలి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం గేట్లు మారుతున్నాయి. ప్రజలకు సేవలందించే చర్యల్లో భాగంగా మంత్రిగా తను ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలో కార్యాలయాలను, అందులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను ప్రక్షాళన చేపట్టాలని మంత్రి భావించారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్య సేవలందించే టెక్కలి జిల్లా ఆస్పత్రిని సందర్శించి పరిశీలించి పర్యవేక్షిస్తే.. ఆస్పత్రికి వచ్చే రోగులు, వాహనాలు రాకపోకలకు వినియోగిస్తున్న ప్రస్తుత గేట్ నిర్మాణం మంత్రికి నచ్చలేదు.


నూతనంగా ఏర్పాటు చేస్తున్న తహశీల్దార్ కార్యాలయ గేట్

దీంతో రంగంలోకి దిగిన మంత్రి ఇంజినీర్లను సంప్రదించారు. ప్రస్తుతం వంశధార కార్యాలయం ఆవరణలో ఉన్న మార్గం మీదుగా ఆస్పత్రికి నూతన గేట్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న గేట్ మూసివేసి భవిష్యత్‌లో నిర్మాణం జరగనున్న మార్చురి గదికి వెళ్లేందుకు రోడ్డుగా వినియోగిస్తారట. అలాగే మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రస్తుతం ఉన్న గేట్ దశాబ్దాల కాలం నుంచి ఉంది. ఇక్కడా ప్రస్తుత గేట్ అడ్డొచ్చింది. అంతే తహశీల్దార్ కార్యాలయానికి చివర్లో అంటే మైత్రి పోలీస్ స్టేషన్ గది పక్క ఉన్న మార్గంలో నూతనంగా గేట్ ఏర్పాటుకు యత్నాలు చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం గేట్ కూడా మార్చేశారు.

మున్సిపాలిటీకి తాగునీరు అందించాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీకి సుమారుగా 8 టిఎండి తాగునీరు అవసరం కాగా, ప్రస్తుతం సుమారు 3 టిఎండి సరఫరా చేస్తున్నారని అన్నారు. ఇంకా 5 టిఎండి అవసరమన్నారు. జలజీవన్ మిషన్ ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేయాలని అన్నారు. తాగునీటి సరఫరా కోసం ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. సమావేశంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు డిఇ రజాక్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, ఎఇ ధనుంజయ, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

జిల్లాకు చేరుకున్న కృతజ్ఞత యాత్ర


ర్యాలీలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : మాదిగల కృతజ్ఞత యాత్ర పేరిట హిందూపురం నుంచి బయలుదేరిన ఎంఆర్‌పిఎస్ నాయకులు సోమవారం శ్రీకాకుళం నగరానికి చేరుకున్నారు. ఎస్‌సి సామాజిక వర్గాల వర్గీకరణ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించడం ఆహ్వానించదగ్గ అంశమని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు సంఘ కార్యదర్శి కానుకుర్తి సూర్యారావు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణకు సానుకూలంగా స్పందించారని, ఈ విభజన వలన 25 వేల మందికి ఉద్యోగాలు దక్కాయన్నారు. విభజనకు సుప్రీం తీర్పు సానుకూలంగా రావడంతో తిరిగి ఎస్‌సి వర్గీకరణతో పాటు మాదిగులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రయోజనం పొందిన ఎస్‌సి ఉపకులాలు ఆయనకు అండగా నిలిచాయన్నారు. అందులో భాగంగా సామాజికి వర్గం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ ఆగష్టు 16న హిందూపురంనుంచిబయలుదేరిన యాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగు తుందన్నారు. రాష్ట్రంలోని 59 ఉప కులాలకు రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. శ్రీనివాస్, కార్తీక్, హేమంత్ కుమార్, ప్రమీల పాల్గొన్నారు.

రత్తకన్నలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో ఉన్న మూడు వార్డు, 18,19,20 వార్డుల్లో 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందుల పడుతున్నారని కౌన్సిలర్ చిడిపోతు జగన్నాయకులు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 15 రోజులుగా తాగునీరు సరఫరా నిలచినా అధికారులు స్పందించడం లేదన్నారు. 18వ వార్డులో కుళాయి నీటి కోసం శంకుస్థాపన చేసినా, ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. తక్షణమే నీటిని సరఫరా చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాధాకృష్ణ

ప్రజాశక్తి- కవిటి

అండర్-14 రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని పెద్ద మెళియాపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మానెక రాధాకృష్ణ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం రాధాకృష్ణని అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేపాత్రో మాట్లాడుతూ రాధాకృష్ణ రాష్ట్రస్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పి.కృష్ణ, ఉపాధ్యాయులు సదానంద గౌడ్, ప్రసాద్ గౌడ్, సంతోష్ కుమార్, క్షమానంద్, చైతన్య, కిరణ్, గిరి పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


నిందితులను అరెస్టు చేసిన సిఐ రామారావు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

ఒడిశా రాష్ట్రం నుంచి పాతపట్నానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని సిఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిందితులను సోమవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.


విరిగిన రైల్వే గేటు

రైల్వే గేటును ఢీకొన్న వ్యాన్

పలాస : కాశీబుగ్గ ఎల్‌సి గేటును సోమవారం వ్యాన్ ఢీకొట్టడంతో విరిగిపోయింది. విజయనగరం నుంచి పలాసకు నిత్యవసర సరుకులు తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో నర్సిపురం వైపు ఉన్న రైల్వే గేట్ వేస్తుండగా వ్యాన్ డ్రైవర్ వెళ్లిపోవాలనే అతృతతో బలంగా ఢీకొట్టాడు. దీంతో గేట్ విరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్‌పిఎఫ్ పోలీసులు గేటును పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది గేటు మరమ్మతులు చేపట్టారు.

ప్రతి బుధవారం హౌసింగ్‌పై గ్రీవెన్స్


రామారావు, కమిషనర్

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపల్ కార్యాలయంలో ప్రతి బుధవారమూ హౌసింగ్ సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు హౌసింగ్ సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధి, మండలంలోని రామకృష్ణాపురం, తర్లకోట, బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని హౌసింగ్ లే అవుట్లు ఉన్నాయని అన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించాలని సూచించారు. హౌసింగ్ సంబంధించిన ఇసుక, సిమెంట్, బిల్లులు రాకపోయినా తదితర సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకుంటే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు.

నిందితులను శిక్షించాలి

పలాస : పలాసలో శనివారం బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పుట్టిన రోజు వేడుకలకు పిలిచి ముగ్గురు అబ్బాయిలు అక్కాచెల్లెళ్లపై అత్యాచారానికి పాల్పడ్డం బాధాకరమన్నారు. అత్యాచారానికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

వాలంటీర్లకు న్యాయం చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం వాలంటీర్లు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ ప్రకాశరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయి పడిన నాలుగు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలన్నారు. బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. నాలుగు నెలల నుంచి జీతభత్యాలు లేక వాలంటీర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రూ.పది వేలు జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, పాడి తిరుపతిరావు, రాము, ధర్మేంద్ర, మురళి, కె.సురేష్, జి.హరి, మల్లేశ్వరి, ఈశ్వరమ్మ, శ్రావణి, విశాలాక్షి, పుష్పలత, చామంతి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

పింఛన్ల జాబితా అందజేయాలని వినతి


మందస : వినతిపత్రం అందజేస్తున్న శివాజీ

ప్రజాశక్తి- పలాస

మండలంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ల జాబితాను తనకు అందజేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ అధికారులను కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మీ కోసంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండలానికి సంబంధించిన పూర్తి వివరాలతో అందజేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఎంపిడిఒ వసంతకుమార్ పాల్గొన్నారు.

నాగావళిని కలిసిన శివాజీ

మండలంలోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తి నాయుడులను శివాజీ కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత రాజకీయాలు, స్థానిక పరిస్థితులపై చర్చించారు. ఆయనతో పాటు దువ్వాడ శ్రీహర్ష, టిడిపి మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ ఉన్నారు.

మందస : మండలంలోని బడాల్సింగి పరిధిలోని గ్రామాలకు ఎండియు ద్వారా అందిస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, ఎన్నింటికి బిల్లులు విడుదలయ్యాయని తెలపాలన్నారు. శ్రీరాంపురం ఆయకట్టుకు శివారు భూములకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హైమావతి, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎపిఒ హరికృష్ణ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాయొద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పంచాయతీ సర్పంచ్‌ల హక్కులను కాలరాయొద్దని వైసిపి సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ రామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25కు ఉపాధి హామీ ద్వారా మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు పంచాయతీ ఆమోదం తెలిపి పనులను గుర్తించామని అన్నారు. పంచాయతీ తీర్మానంతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. పనులు మంజూరైన తరువాత అధికారులు కూటమి నాయకులతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయించారని అన్నారు. దీనిపై న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, పాతిర్ల రాజశేఖరరెడ్డి, కారిగా త్రినాథ్, గుజ్జు ఢిల్లీరావు, పిట్ట మామయ్య, వలపాల రమణ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

నాటికల పోటీల్లో రాజేశ్వరరావు ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజేశ్వరరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సుమిత్ర కళాసమితి, సూత్రా ఫౌండేషన్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన పరిషత్ పోటీల్లో పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు రచించిన నాటిక పులి కాలంలో హాస్య పాత్ర ధరించిన మండా రాజేశ్వరరావుకు ఉత్తమ హాస్య నటుడు బహుమతి లభించింది. కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలిపై అత్యాచారం అంశంగా మన జిల్లా యాసతో కూడిన ఈ నాటిక అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ముగింపులో ఈ అవార్డును రచయిత కె.వి.రాజారావు అందుకున్నారు. పులి కాలం నాటికకు అవార్డు రావడంపై పట్టణంలోని కవులు, రచయితలు ఆనందం వ్యక్తం చేశారు.

రాజేశ్వరరావుకు అభినందనలు

హాస్యనటుడు మండా రాజేశ్వరరావును కళామండలి సభ్యులు ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన పరిషత్ నాటికల పోటీల్లో రాజారావు రచించిన పులికాలం నాటికలో ఉత్తమ హాస్యనటుడుగా అవార్డు పొందిన రాజేశ్వరరావును శ్రీవెంకటేశ్వర కళామండలి సభ్యులు బొడ్డేపల్లి జనార్దనరావు, కె.శ్యామలరావు, కె.వి.రాజారావు జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.


బహుమతులను ప్రదానం చేస్తున్న యాజమాన్యం

అధునాతన వైద్య సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో వస్తున్న మార్పులను, అధునాతన పద్ధతులు అవలంబించటం ద్వారా రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించటమే లక్ష్యమని 'నేషనల్ ఫిజియోథెరపీ' సదస్సు పిలుపునిచ్చింది. జిలాల్లోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో జెమ్స్ ఫిజియోథెరపీ కళాశాల, జెమ్స్ కేన్సర్ వింగ్ సంయుక్తంగా గురు, శుక్ర, శని, ఆదివారాల్లో జాతీయ సదస్సు నిర్వహించింది. ముంబై, చెన్నై, హైదరాబాద్, విజయవాడతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనుభవజ్ఞులైన ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులు పెద్దఎత్తున ఈ సదస్సుకు హాజరయ్యారు. వైద్య రంగంలో తమ అనుభవాలను, ఆధునిక చికిత్సలు, వైద్య విధానాలపై వైద్యులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కేన్సర్ రిహాబిలిటేషన్‌లో సరికొత్తగా వచ్చిన ఫిజియోథెరపీ పద్ధతులు, ఇతర నివారణా పద్ధతులపై వివరించారు. నూతనంగా వచ్చిన మెరుగైన విధానాలను పాటించాలని కోరారు. జెమ్స్ ఆస్పత్రి కేన్సర్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకటరమణ, డాక్టర్ రవీంద్ర నందన, ముంబైకి చెందిన టాటా మెమోరియల్ కేన్సర్ ఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ అనురాధ దప్తర్దార్, డాక్టర్ అజీత కులకర్ణి సంయుక్తంగా కేన్సర్ రిహాబిలిటేషన్‌లో వక్తలుగా వ్యవహరించారు. జెమ్స్‌లో మెరుగైన వైద్యం అందిస్తూ నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్న జెమ్స్ యాజమాన్యం డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, సంస్థ సిఇఒ అద్విక్, సిఎఒ స్వర్ణ రామ్మోహన్‌లను విద్యార్థులు, పలువురు వక్తలు కొనియాడారు. తొలుత స్పోర్ట్, అకడమిక్ ఈవెంట్లు ఉత్సాహంగా కొనసాగాయి. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు ప్రధానం చేశారు. గుంటూరు ఎన్‌ఆర్‌ఐ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేష్, హైదరాబాద్ తన్వీ రోబోటిక్ రిహాబిలిటేషన్ చీఫ్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుబ్బరాయులు, ముంబైకి చెందిన పీడియాట్రిక్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శద్ధ కదమ్, విజయవాడకు చెందిన డాక్టర్ ఇంద్రాణీలు ఎర్గోనిమిక్స్, ఫిడిమిట్రిల్, ఫిజియోథెరపీ, రోబోటిక్ ఫిజియోథెరపీ, ఆబ్స్టెట్రిక్స్, గైనకాలజీలో ఫిజియోథెరపీ పాత్రకి సంబందిత అంశాలు వివరించారు. ఈ జాతీయ సెమినార్‌లో వివిధ కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గన్నారు. జెమ్స్ ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాహుల్ షేక్, జెమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.లక్ష్మీ లలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అశోక్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధీర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బాబూరావును సన్మానిస్తున్న జీడి వ్యాపారులు

బాబూరావుకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావుకు జీడి వ్యాపారులు ఆయన స్వగృహంలో సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. తన వంతుగా సహాయ, సహకారాలు అందించాలని వ్యాపారులు కోరారు. కార్యక్రమంలో జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్, పి.రవికాంత్, కె.వి.శివ, మల్లా భాస్కరరావు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో సిక్కోలు కుర్రోడు

హిరమండలం: మండలంలోని రుగడకు చెందిన యువ కవి, రచయిత ఐ.రాణాప్రతాప్ ఈ నెల 19,20 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్దాల కాన్వెన్సన్ హాల్‌లో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ప్రపంచ తెలుగు సాహిత్య - కళాజాతర నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక నిరంతర సాహితీ, కళా ప్రభంజనంలో భాగంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతరలో ప్రపంచ సాహిత్య సదస్సులో పాల్గొని 'బోధనా భాషగా తెలుగు' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. దీనికిగాను అభినందిస్తూ, తెలుగు సాహితీ కళా చరిత్రలో 24 గంటల 24 నిముషాల 24 సెకన్ల పాటు నిర్విరామంగా నిర్వహించిన రికార్డ్స్‌గా గుర్తించి అమేజింగ్ వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్, భారత్ టాలెంట్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ అఫ్ రికార్డ్స్, వరల్డ్ నెంబర్ వన్, తానా, కల్చరల్ టాలెంట్స్ బుక్ అఫ్ రికార్డ్స్ రాణాప్రతాప్ పేరు నమోదు చేస్తున్నట్లుగా ధ్రువీకరించారు. అనంతరం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన దుశ్శాలువ కప్పి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, కళాకారులు, రచయితలు, బంధుమిత్రులు, అధ్యాపకులు అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న రాణాప్రతాప్


కవిటి : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

అభివృద్ధే అజెండా

పోలాకి : పల్లె పండగలో భాగంగా తోటాడ నుంచి గొల్లలవలస వరకు రూ.1.20 కోట్లతో బిటి రోడ్డు, రూ.1.27 కోట్లతో వనితమండలం రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే బగ్గు వెంకటరమణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, గొండు రామన్న, పంచిరెడ్డి సింహాచలం, లుకలాపు రాంబాబు పాల్గొన్నారు.

కవిటి: అభివృద్ధే అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటి పంచాయతీలో కవిటి టౌన్, కాలనీ, బొర్రపుట్టుగ, తొత్తిడిపుట్టుగ, కర్రివానిపాలెం, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి రూ.1.4 కోట్ల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బెందాళం రమేష్, మణిచంద్ర ప్రకాష్, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, కొర్రాయ్ వాసుదేవ్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పల్లె పండగలో భాగంగా రూ.17 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి టిడిపి యువత ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, ఎంపిపి సూళ్ల చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి కోనారి అప్పారావు, లండ ధనరాజ్, లండ నరేష్, మాజీ సర్పంచ్ కొల్లి రమేష్ పాల్గొన్నారు.

మందస : పల్లె పండగలో భాగంగా మండలంలోని నారాయణపురం, మల్లేనావారిపేట గ్రామాల రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దాసరి తాతారావు, టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, మాజీ సర్పంచ్ బొంగు దామోదరం, లబ్బ ఎర్రయ్య పాల్గొన్నారు.


పోలాకి : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


మందస : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి శ్రీనివాసరావు

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 10 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్దిత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులు ఆదేశించారు. పలు సమస్యలపై ప్రజల నుంచి 40 వినతులు అందాయి.



మాట్లాడుతున్న రమణమూర్తి

బకాయిలపై స్పష్టత ఇవ్వాలి

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా గడచిన ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన వివిధ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా పెండింగ్ సమస్యలపై స్పష్టత కొరవడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యకు గొడ్డలి పెట్టుగా ఉన్న 117 జిఒ రద్దు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షదాయకమన్నారు. ఈ జిఒ రద్దుతో ప్రభుత్వ పాఠశాలలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆరేళ్లుగా రూ. 25 వేల కోట్లు బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయు లకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. తక్షణమే బకాయిల విడుదలకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి పి. తమ్మినాయుడు, ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారావును సత్కరిస్తున్న కళాసమితి సభ్యులు

చిన్నారావుకు కళా సత్కారం

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ రంగస్థల కళాకారుడు, నటుడు, మేకప్ ఆర్టిస్ట్ గుత్తు చిన్నారావును జిల్లాస్థాయి నాటకోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. శ్రీ సుమిత్ర కళాసమితి, సూత్ర ఫౌండేషన్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జిల్లాస్థాయి నాటక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గుత్తు చిన్నారావును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర్ శర్మ కొంఖ్యాన మురళీధర్, నూక సన్యాసిరావు, నిక్కు హరి సత్య నారాయణ, మండవిల్లి రవి, చిట్టి వెంకటరావు, తంబి, ప్రధాన విజయరాం, వివిఆర్ మూర్తి, ఎస్.వి. రమణ మాదిగ, కొమ్మనాపల్లి సురేష్ పాల్గొన్నారు.

గ్రామసభకు 74 దరఖాస్తులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని ఆడారు గ్రామంలో సోమవారం రీసర్వే భూ సమస్యల పరిష్కారానికి 74 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా రీ సర్వేలో భూమి తక్కువ వచ్చిందని, మ్యుటేషన్లు, పేర్లు మార్చాలని, తదితర వాటికి దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు

సాగునీరు అందించాలని ధర్నా

ప్రజాశక్తి-పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని సోమవారం రైతులు ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ మండలంలో తోటపల్లి కాలువ శివారు ప్రాంతాలకు నేటికీ ఒక్క చుక్క నీరు అందలేదని చెప్పారు. ఇంతవరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. 7, 8 బ్రాంచుల కింద రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో సాగునీరు అందించకపోతే రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఆయకట్టు రైతుల ప్రతినిధి కండాపు ప్రసాద్ మాట్లాడుతూ 8వ బ్రాంచ్ కిందున్న ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. అనంతరం ఇరిగేషన్ ఎఇ శంకర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కరణం అప్పారావు, సోమశేఖర, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



రణస్థలం రూరల్ : జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు వినియోగించుకుంటే ఆరోగ్యం ఉంటుందని యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో నడుకుదిటి ఈశ్వరరావుకు చెందిన 0.60 సెంట్లు విస్తీర్ణంలో ఎస్ఐఆర్ కాలేజ్, స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో భోజనాలను పెట్టాలనే ఉద్దేశంతో ఎటిఎం పద్ధతిలో కూరగాయల సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. మొక్కల ఎదుగుదల, పోషకాలు అందించేందుకు 20 రోజులకు ఒకసారి 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని మొక్కలకు విడిచి పెట్టడం జరుగుతుందన్నారు. అలాగే వంగ, బెండలో కాయ కాండం తొలిచే పురుగు నివారణ నిమిత్తం సోమవారం 20 లీటర్ల అగ్ని అస్త్రాన్ని తయారు చేశారు. ఘణ, ద్రవ జీవామృతాలను, కషాయాల ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్త గిరిజాల సూర్యకాంతం, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్య ఉత్పత్తుల అమ్మకం

ఆమదాలవలస: పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టారు.



ఆమదాలవలస : కూరగాయలను విక్రయిస్తున్న సిబ్బంది

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిజిటల్ యల్‌టు సురేష్ మాట్లాడుతూ చేపేనపేట, నిమ్మతొర్లువాడలో ఎ-గ్రేడ్ మోడల్‌లో సాగు చేసిన కూరగాయలు చిక్కుడు, బెండ, బీర విక్రయించడం జరిగిందని తెలిపారు. నిమ్మతొర్లవాడ అంగన్వాడీ కేంద్రం వద్ద పిల్లలకు కూరగాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

విఆర్‌ఎల సంఘ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య

శ్రీకాకుళం అర్బన్ : రెవెన్యూ వ్యవస్థలో క్షేత్రస్థాయిలో అత్యంత కీలకంగా ఉన్న గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా రెవిన్యూ ఉద్యోగుల సంఘం అతిధి గృహంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షులు కె.శ్రీరాములు, కార్యదర్శి బివివిఎస్ రాజు, సహాధ్యక్షులు



నూతన కమిటీని అభినందిస్తున్న బ్రహ్మయ్య

పి.శ్రీనవాసరావుతో పాటు ఆయన హాజరయ్యారు. ప్రధానంగా రెవిన్యూ సహాయకుల కరువు భత్యాన్ని రికవరీ చేయడం అన్యామన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి రికవరీ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు. అర్హత గల విఆర్‌ఎలకు రెవెన్యూ కార్య దర్శులుగా, విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. సుదీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విఆర్‌ఎల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసు కోవాలన్నారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా జి. వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కె.గోపి, సహాధ్యక్షునిగా బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.రమణ, నాయుడు, ట్రెజరర్‌గా ఎస్.త్రినాథరావు, జాయింట్ సెక్రటరీగా పాగోటి ప్రసాదరావు, ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.



నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పశువులకు నట్టల నివారణ మందులు

కోటబొమ్మాళి: నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకల పెంపకందారులు తమ పశువులకు వేయించుకోవాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు ఎం.లోకనాథం, పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కకుమార్‌లు అన్నారు. మండలంలోని పట్టుపురం, రామయ్యపేట, యలమంచిలి, కిష్టుపురం, సింహాద్రీపురం, పొన్నానపేట, సాలిపేట తదితర గ్రామాల్లో 3,500 గొర్రెలు, మేకల ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. ఈ మందులు వాడటం వల్ల జీవాల బరువు పెరుగుతాయని, దీంతో ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు వెంకటరత్నం, లక్ష్మీనరసమ్మ, ముకుందరావు, ధర్మారావు, శోభ, బాలమ్మ, రాంబాబు పాల్గొన్నారు.



సురేష్‌ను పరామర్శిస్తున్న గాంధీ తదితరులు

సురేష్‌కు గాంధీ పరామర్శ

బూర్జ: ఇటీవల ఇసుక మాఫియా చేసిన దాడిలో గాయపడిన సనపల సురేష్‌ను గుత్తావల్లిలో సోమ వారం ఇటీవల ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సువ్వారి గాంధీ పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు కక్ష సాధింపు చర్యతో దాడికి పాల్పడడం అమాను షమన్నారు. ఈ దాడులను చూస్తుంటే ఈ ప్రభుత్వం నియోజకవర్గంలో శాంతి భద్రతలను గాలికి వది లేసినట్లు కనిపిస్తుందన్నారు ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా చూడాలని, సురేష్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురేష్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సువ్వారి అనిల్, పోతురాజు సూర్యారావు, ఐడి విజయ్, ప్రశాంత్, మోహన్ చౌదరి, గాపు శివ, సూర్య కిరణ్, రాజశేఖర్, కోరాడ శ్రీను కార్యకర్తలు ఉన్నారు.

వేడుకగా నందన్న సంబరాలు

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ, బైరిపురం, ఎర్ర గోవిందపుట్టుగ, సూరిపుట్టుగ, సిహెచ్ పొడియపుట్టుగ గ్రామాల్లో నందన్న, గౌరమ్మ సంబరాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విచిత్ర వేష ధారణలతో నందన్న, గౌరమ్మలను ఊరేగిస్తూ సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా పాల్గొని ఉత్సవాలు నిర్వహి స్తున్నారు. ఈ వేడుకలు 12 రోజు పాటు జరుగు తాయని నిర్వాహకులు తెలిపారు. బండారు ఢిల్లీరావు, బండారు దశరథరావు, మాధవరావు బిసాయి, పిల్లి శంకర్, ఇ.వెంకటరమణ, పి.లోకనాథం, పి.రఘునాథ్, పి.జోగారావు, పి.డాలు పాల్గొన్నారు.

సమాజహిత అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత సమాజంతో పాటు గత చరిత్ర, సమాజహిత అంశాలపై విద్యార్థులు అవగహన పెంచు కోవాలని, అందులో భాగంగా ఆలోచనా శక్తిని పెంచుకునేందుకు చదరంగం క్రీడను నేర్చుకోవాలని వినియోగదారుల ప్రొటెక్షన్ రైట్ జిల్లా అధ్యక్షులు, సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డా.గంజి ఆర్ ఎజ్రా అన్నారు. నగరంలోని ఇలిసిపురం వద్ద తిలక్ నగర్‌లో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ ఆధ్వర్యాన చిన్నారులతో చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొని ఐదు రౌండ్ల చెస్ క్రీడను ఆసక్తిగా ఆడారు. విజేతలుగా బలివాడ జయంత్ ఐదు రౌండ్లలో విజేతగా నిలవగా, తర్వాత స్థానాల్లో పి.కార్తికేయ, గెల్లంకి ఆశ్రితరాం, ఎన్.వి. దర్శిత్, శిల్లా రామహర్షిత్, ఎస్.వి. జశ్విన్, కరణం రోహన్, ఉరిటి లిఖిత్, టి.తనయ్ తనిష్, బెహరా దుర్గాప్రసాద్, కల్లేపల్లి మాన్విత్, కరణం పార్థవి, వి.సత్యమోహిత్, పి.అఖిల్, జలుమూరు శ్రీసుహాస్,



పోటీలో పాల్గొన్న చిన్నారులు

చింతాడ రానాచార్య, పాతిన హేమంత్, చింతాడ రోషన్, పాతిన జ్యోతీప్రకాష్, కడియం తనీష్, పి. ప్రవీణ్‌లు నిలిచారు. వారికి ఎజ్రా, ఆయన సతీమణి నవోదయ విద్యాలయం అధ్యాపకురాలు అనీరోజ్ బహుమతులను అందజేశారు. చదరంగం మేధావుల క్రీడగా అభివర్ణించారు. కార్యక్రమంలో శ్రీసాయి దుర్గా ట్యూషన్ సెంటర్ ప్రిన్సిపాల్ కె.ఉమారాణి, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్ భేరి చిన్నారావు, కె.సాయి, నిరం జన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వాకర్స్ అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అమెరికాకు చెందిన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్న డాక్టర్ మంతిన వాసుదేవాచారి జిల్లా వాసి కావడం గర్వకారణమని పలువురు ప్రశంసించారు. గజిల్స్ గాయకునిగా, వ్యాయామ ఉపాధ్యాయుడు, కవి, రచయితగా ఆయన పేరు తెచ్చుకున్నారన్నారు. సోమవారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో ఆయనను పలువురు సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడంతో పాటు 46 పురస్కారాలు అందుకున్నారని, తాజాగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొంది అంతర్జాతీయ స్థాయిలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు సాధించగలిగారన్నారు.

ఆయనను లయన్స్ క్లబ్ సెనెటర్ నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్లు జి. ఇందిరా ప్రసాద్, కె.వి.రమణమూర్తి, గుడ్ల



సత్కరిస్తున్న వాకర్స్

సత్యనారాయణ, పి.జి. గుప్తా, ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, డిప్యూటీ గవర్నర్ సంజీవరావు, మీడియా జెఎసి నాయకులు కొంక్యాన వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు, వాకర్స్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, సూర్యారావు, దేవీ ప్రసాద్, సంతోష్ తదితరులు అభినందించారు.

జోరుగా జూదాలు

పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలో జూదాలు జోరుగా సాగుతున్నాయి. పల్లె ప్రాంతాలతో పాటు గిరిజన గ్రామాల్లో కూడా పేకాట విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పాలవలస, హరిపురం, పల్లాపురం తదితర గ్రామాల సమీపాల్లో ఉన్న కొండల వద్ద పేకాట అనునిత్యం జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే లాభాం, గుత్తావల్లి, నారాయణపురం తదితర నాగావళి నదీతీర గ్రామాల్లోని తోటల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పేకాటలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల జాడ కనిపించడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ముఖ్యంగా మండలంలోని ఉప్పునివలస పంచాయతీ పరిధిలో ఉన్న తోటలో పేకాట జరుగుతున్న సమయంలో జరిగిన కొట్లాటలో భాగంగా హోంగార్డు చేతిలో జమ్మన సుదర్శన్ అనే దళిత యువకుడు మృతి చెందిన విషయం విధితమే. అయినప్పటికీ ఈ ప్రాంతాల్లో పేకాట విచ్చలవిడిగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. దీనివలన పాలకొండ, ఆమదాలవలస ఇతర మండలాల నుంచి కూడా జూదరులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేకాట ఆడే సమయంలో మద్యం సేవించి ఉండడం వలన కొట్లాటలు, గొడవలు జరుగు తున్నాయన్నారు.

ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక పోలీసులకు తెలియజేసినప్పటికీ చర్యలు శూన్యమని స్థానికుల వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో జరుగుతున్న పేకాటలను అరికట్టాలని స్థానికుల కోరుతున్నారు.

ఇదే విషయంపై ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాండ్రంకి సత్యనారాయణను వివరణ కోరగా మండలంలో జరుగుతున్న పేకాట శిబిరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ముఖ్యంగా ఈ సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసి జూదాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తామన్నారు. పేకాటలు ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఇఒ లింగరాజు

అపార్ ఐడి ఉండాలి

పోలాకి: ప్రభుత్వ ఆదేశాల మేరకు 9,10 తరగతలు చదువుతున్న విద్యార్థులకు ఆపార్ ఐడి (ఆటోమేటిక్ పర్మనెంట్ అకాడమిక్ ఎకౌంటు రిజిస్టర్) క్రియేట్ చేయాలని ఎంఇఒ లింగరాజు సూచించారు. ఎంఆర్‌సిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆధార్ ఐడి, పెన్ ఐడిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి తద్వారా ఆపార్ ఐడి క్రియేట్ చేయాలన్నారు. ఐడి క్రియేట్ చేసినప్పుడు సాంకేతిక సమస్యలు ఉంటే తెలియచేయాలని సూచించారు.

కె.కొత్తూరు పిహెచ్‌సి తనిఖీ

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీకాంత్ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీ, డ్రగ్, స్టోర్స్, ప్రయోగశాల, లేబర్ గదులను పరిశీలించారు. శానిటేషన్కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, వైద్యులు గాయత్రి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు బిఆర్‌ఎయు బృందం

ఎచ్చెర్ల: ఇంటర్ 'వర్శిటీ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ వార్షిక పోటీల్లో పాల్గొనే డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్రీడా బృందం ఎంపికైంది. 'వర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్, మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల ఈ ఎంపికలు జరిగాయి. ఈ నెల 26 నుంచి 29 వరకు చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో జరగనున్న పోటీల్లో ఈ బృందం పాల్గొననుంది. ఈ సందర్భంగా సోమవారం డా.బిఆర్‌ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. వర్శిటీ క్రీడా సంబంధిత డీన్ డా. యు.కావ్యజ్యోత్స్న, వర్శిటీ క్రీడా కార్యదర్శులు ఎం.శ్రీనువాసరావు, భాస్కర్‌లు పాల్గొన్నారు.



నాటికలో ఓ సన్నివేశం

'ఆలి తిప్పలు' నాటికకు గుర్తింపు

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రజాచైతన్య కళాసమితి సభ్యులు మూల తాతయ్య, డిఎ స్టాలిన్ బృందం ఈనెల 19,20 తేదీల్లో తాడేపల్లిలోని కళావేదికలో ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో ప్రదర్శించిన నాటికకు గుర్తింపు లభించింది. అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టిఎస్ఎ, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కినట్లు కళాసమితి అధ్యక్షులు యు.గణపతిరావు తెలిపారు. ప్రజా కళాసమితి సభ్యులను సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు.



నగదు మొత్తాలను అందజేస్తున్న హరిబాబు

ఇంటి నిర్మాణానికి సాయం

శ్రీకాకుళం అర్బన్ : కోవిడ్ వలన తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను ఆదుకునేందుకు 2021లో పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం ద్వారా జిల్లాలో 9 మంది కోవిడ్ అనాథ బాలలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల వంతున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్‌లో జిల్లా కలెక్టర్ గార్డియన్‌గా పిల్లలతో జాయి ంట్ అకౌంట్‌లో డిపాజిట్ చేశారు. వారికి 18 ఏళ్లు నిండిన తర్వాత సింగిల్ అకౌంట్‌గా మార్పు చేసి ప్రతినెల స్టైఫండ్ రూ.5,500 వంతున వారి ఖాతాలో జమ చేశారు. అలా జమ చేసిన మొత్తాల నుంచి చింతపల్లి మూర్తికి రూ. 1.68 లక్షలు, చింతపల్లి గీతకు రూ.1.32 లక్షలు సొంతిల్లు నిర్మించు కునేందుకు వీలుగా తీసుకున్నారు. ఆ మొత్తాన్ని పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ వండాన హరిబాబు, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, హెడ్ పోస్ట్‌మాస్టర్ పి. రంగారావు, బాలల రక్షణ అధికారి ఐ.లక్ష్మనాయుడు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ బానోజీరావు సమక్షంలో పిల్లలకు అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: బెంతు ఒరియా విద్యార్థులు, యువకుల భవిష్యత్‌కు 300 రోజులుగా శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, తమ సమస్యలు గుర్తించి ఇకనైనా తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి కనికరించాలని బెంతు ఒరియా యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి కోరారు. ఈ మేరకు సోమవారం దీక్షలో వరకకు చెందిన బెంతు ఒరియాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చాలా కమిషన్లు వేశారని, వాటన్నింటి సారాంశాన్ని క్రోడీకరించి తమకు న్యాయం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని, తొందర్లోనే తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుదిష్టి మజ్జి, రమేష్ జెన్నా, సూరజ్ పురియా, ప్రదీప్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.